క్లుప్తంగా

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి



పెనమలూరు: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని మలాల యూసుఫ్ జాయ్ ఉమెన్ వెల్ఫేర్ అండ్ ఎడ్యూకేషన్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ ఇలియాస్ అన్నారు. యనమలకుదురు వీఎల్ విజ్ఞాన భవన్‌లో గురువారం ఆయన కుట్టు, బ్యూటీషన్ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించి ప్రసంగించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో సొసైటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతీ ఒక్కరు శిక్షణ పొంది స్వయం ఉపాధి పొందాలని అన్నారు. కార్యక్రమంలో ఆయేషా, వలీమా, నేతలు షేక్ కాశిం, ఉప్పాడ త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉచిత మజ్జిగ పంపిణీ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం వద్ద దాతల సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత మజ్జిగ పంపిణీ విజయవంతంగా కొనసాగుతోంది. ఆలయ ప్రాంగణంలో గురువారం వేమినేని సత్యనారాయణ జ్ఞాపకార్థం దాతలు స్వరాజ్యం, వేమినేని కిషోర్, రజితలు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్ మాట్లాడుతూ వేసవి కాలం పూర్తయ్యేవరకు ఉచిత మజ్జిగ కేంద్రాన్ని కొనసాగించనున్నట్లు వివరించారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సహకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పీ లోకేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీగోపాల ఆలయానికి ఎన్ఆర్ఐలు రూ.లక్ష విరాళం



పెనమలూరు: పెనమలూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీగోపాలకృష్ణాలయానికి అమెరికాకు చెందిన ఎన్ఆర్ఐల అసోసియేషన్ గురువారం లక్ష రూపాయలు విరాళం ఇచ్చారు. ఎన్ఆర్ఐ కమిటీ సభ్యులు కిలారు ప్రవీణ్‌కుమార్, మొర్ల నరేంద్రబాబు, పాలడుగు సుధీర్ వివరాలు తెలుపుతూ గ్రామంలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో విగ్రహ ప్రతిష్టా మహోత్సవం జరుపుతున్నారని పేర్కొన్నారు. దీంతో ఆలయానికి లక్ష రూపాయల విరాళం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గోగం వెంకటేశ్వరరావు, గద్దె శ్రీనివాస్, గ్రామస్తులు చనుమోలు శరత్, రామకృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

సీఏఏను రద్దు చేయాలి

పెనమలూరు: పౌరసత్వ సవరణ చట్టం వెంటనే రద్దు చేయాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి డిమాండ్ చేశారు. యనమలకుదురు లాకుల వద్ద సీఏఏకు వ్యతిరేకంగా గురువారం నిరసన ప్రదర్శన చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక చట్టాలు తీసుకువచ్చి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. ఈ చట్టాలతో మతాల మధ్య చిచ్చు పెడుతుందని అన్నారు. కార్యక్రమంలో నేతలు షేక్.కాశిం, మస్తాన్‌వలి, వాటపల్లి శ్రీరాములు, మేకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీరువా తాళాలు పగలకొట్టి చోరీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): తాళాలు వేసి ఉన్న ఇంట్లోకి దొంగలు ప్రవేశించి బీరువా తాళాలు పగలకొట్టి చోరీకి పాల్పడిన ఘటన విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చెత్త డంపింగ్ యార్డ్ సమీపంలో నివసిస్తున్న పాల సాక్షి రోజూలానే తన ఇంటికి తాళాలు వేసి తన పనులకు వెళ్లింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా ఇంటి వెనుక తలుపు తెరిచి కనిపించింది. దీంతో అనుమానం వచ్చిన ఆమె ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తీసి అందులోని సామాన్లన్నీ చిందరవందరగా పడేసి కనిపించాయి. బీరువా లాకర్‌లో పెట్టిన రూ.40 వేల నగదు, 8 గ్రాముల బంగారు ఉంగరాలు రెండు మాయమయ్యాయి. తమ ఇంట్లో దొంగలు పడ్డారని భావించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిపక్షాల కుట్రలు తిప్పికొట్టాలి

మంత్రి జోగి రమేష్



హనుమాన్‌నగర్‌లో ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్

ఉయ్యూరు: ప్రతిపక్షాల కుట్రరాజకీయాలను తిప్పికొట్టాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని 16వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పాలన అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. జగనన్నను ఒంటరిగా ఎదుర్కోలేక చంద్రబాబు, పవన్, బీజేపీతో కలిసి ఎన్నికలకు వస్తున్నారని అన్నారు. అనైతిక పొత్తులతో వచ్చే ప్రజా వ్యతిరేక పార్టీలను ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టాలని సూచించారు.

నిషేధిత భూముల సమస్య పరిష్కరిస్తా..

హనుమాన్‌నగర్‌లోని నిషేధిత భూముల సమస్య పరిష్కరిస్తానని మంత్రి జోగి రమేష్ హామీ ఇచ్చారు. స్థానికులు మంత్రి రమేష్‌కు తమ ఇళ్లు 22ఏ జాబితాలో చేర్చారని, గత టీడీపీ ప్రభుత్వ హయాం నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్య పరిష్కరించి అండగా నిలవాలని కోరారు. మంత్రి రమేష్ మాట్లాడుతూ 22ఏ జాబితాలో భూముల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఉయ్యూరు తహసీల్దార్ నుంచి నివేదిక సిద్ధం చేసి పంపించామని తెలిపారు. హనుమాన్‌నగర్‌లో భూములు, ఇళ్లు నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీఎం జగన్ రాష్ట్రంలో ఎంతో మంది పేదలకు తమ భూములు, ఇళ్లను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించి భూమిపై హక్కు కల్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ డాక్టర్ జంపాన పూర్ణిమ, వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, ప్రభుత్వాసుపత్రి చైర్మన్ జంపాన కొండలరావు, కౌన్సిలర్లు గుంజా సుధాకర్, ఊర శ్రీవాణి, లక్ష్మి, గోన మదన్, చిన్ని, కమిషనర్ పీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న రాజీవ్

ఇంటింట ప్రచారం..

మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ గురువారం ఉయ్యూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వీరమ్మతల్లి ఆలయ సమీపంలోని ప్రాంతాల్లో గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, తన తండ్రి జోగి రమేష్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జంపాన రవి, జంపాన స్వామి, ఊర నాగిన్, వీరంకి జయప్రకాష్, బ్రహ్మం, బాబ్జీ, అబ్దుల్‌సద్దాం, జంపాన దీపు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రాధాన్యం

గన్నవరం: పేదప్రజల అభ్యున్నతి, సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తోందని ఎంపీపీ అనగాని రవి పేర్కొన్నారు. మండలంలోని అల్లాపురం, కేసరపల్లి, వీఎస్.పురం గ్రామ సచివాలయాల్లో గురువారం పేదలకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల స్థలాల దస్తావేజులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ చరిత్రలోనే అత్యధికంగా 27 వేల పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌లకు దక్కుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో కొంత మంది పెత్తందారులు పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయకుండా కోర్టులకు వెళ్లి అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ఇటువంటి పెత్తందారుల టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని వచ్చే ఎన్నికల్లో చిత్తు చేసేందుకు పేదలందరూ వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. వంశీమోహన్‌ను ప్రజలు నిండు మనస్సుతో ఆశీర్వదించాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి కోరారు. వైస్ ఎంపీపీ కే శివనాగరాజకుమారి, సర్పంచ్‌లు డొక్కు సాంబశివవెంకన్నబాబు, సీ లక్ష్మీమౌనిక, పార్టీ నాయకులు బొడ్డు ఆంజనేయవరప్రసాద, గడ్డం అంకాలు, పలువురు పాలకవర్గ సభ్యులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కేసరపల్లిలో రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

అభివృద్ధి పనులపై చైర్మన్ సమీక్ష

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అభివృద్ధి పనులపై చైర్మన్ కర్నాటి రాంబాబు ఇంజినీరింగ్ అధికారులతో గురువారం సమీక్షించారు. మహా మండపం ఏడో అంతస్తులోని చైర్మన్ చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో మల్లేశ్వర స్వామి వారి ఆలయం తుది పనులు, యాగశాల, పూజా మండపాల పనులతో పాటు లడ్డూ, అన్నదానం, క్యూలైన్ల పనుల గురించి చర్చించారు. పనులను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించడంతో పాటు దసరా నాటికి పూర్తి చేసేలా చూడాలని కోరారు. సమావేశంలో ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ శేరినరసన్నపాలెం

- రూ. 3.14 కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులు
- రూ. 67.60 లక్షలతో ప్రభుత్వ భవనాలు
- డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ. 23.37 కోట్ల లబ్ధి





గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

హనుమాన్‌జంక్షన్ రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో పల్లెటూళ్ల ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. గ్రామాలు అభివృద్ధికి దర్పణాలుగా నిలుస్తున్నాయి. ఊరూరా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్క్ అభివృద్ధి కనబడుతోంది. బాపులపాడు మండలం శేరినరసన్నపాలెం గ్రామం అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సుమారు రూ. 3.14 కోట్లతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు జరిగాయి. అలాగే డీబీటీ పద్ధతిలో మరో రూ. 18.04 కోట్ల మేర పేదలకు లబ్ధిచేకూరింది.

ప్రభుత్వ భవనాలు, పాఠశాలకు కొత్త సొగసులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలోని ప్రభుత్వ భవనాలు, పాఠశాల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. రూ. 43.60 లక్షలతో రెండు అంతస్తులతో గ్రామ సచివాలయం భవనం, రూ. 24 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని నిర్మించారు. అంతేకాకుండా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు రూ. 18 లక్షలతో మనబడి నాడు–నేడు కింద మౌలిక సదుపాయాలు కల్పించారు.

జగనన్న కాలనీలతో సొంతిళ్లు

గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 65 లక్షలతో రెండు ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామంలోని 80 మంది నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేశారు. అంతేకాకుండా జగనన్న కాలనీలో విద్యుత్, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలను కూడా ప్రభుత్వం కల్పించింది. రూ. 39.20 లక్షలతో తాగునీటి సరఫరా నిమిత్తం రెండు విద్యుత్ మోటారు బోర్లు, పైప్‌లైన్లు, కరెంట్ సదుపాయాలను ఏర్పాటు చేశారు. జగనన్న కాలనీలో మెరక, రోడ్లు, డ్రైనేజీ ఏర్పాట్లుకు రూ. 16 లక్షలు వెచ్చించారు.



గ్రామ సచివాలయ భవనం

మౌలిక సదుపాయాల కల్పన

గ్రామంలో రూ. 14.70 లక్షలతో ఐదు సీసీ రోడ్లు నిర్మించగా, రూ. 20 లక్షలతో స్మశానవాటికకు కాంపౌండ్ నిర్మాణం చేపట్టారు. జలజీవన్ మిషన్ పథకం కింద గ్రామంలో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు రూ. 74 లక్షలు మంజూరు అయ్యాయి. ఇవి కాకుండా గ్రామంలోని పేదలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ పద్ధతిలో రూ. 18.04 కోట్లు, నాన్ డీబీటీ పద్ధతిలో రూ. 5.33 కోట్ల మేర లబ్ధి చేకూరింది.

వేగంగా అభివృద్ధి పనులు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంస్కరణలకు శ్రీకారం చుట్టి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. దీంతో గ్రామంలోనే ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే వలంటీర్లు, సచివాలయం ద్వారా నేరుగా, పారదర్శకంగా పౌరసేవలు, సంక్షేమ పథకాలు అందుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామంలో పలు అభివృద్ధి పనులు వేగంగా జరిగాయి. పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంతో పాటు జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలను కూడా కల్పించాం.

అడపా అంజిబాబు, సర్పంచ్

రైల్వే ట్రాక్‌ల వెంబడి నడకమార్గాలు ఏర్పాటు చేయాలి



డీఆర్ఎంకు వినతి పత్రం సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వంశీమోహన్

రామవరప్పాడు: రామవరప్పాడు గ్రామంలో రైల్వే ట్రాక్‌ల వెంబడి నడక మార్గాలను ఏర్పాటు చేయాలని కోరుతూ గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ గురువారం విజయవాడ రైల్వే డివిజన్ మేనేజర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ గ్రామ ప్రజలు నిత్యం రాకపోకలు సాగించేందుకు రైల్వే ట్రాక్‌లకు ఆనుకుని ఉన్న చదును చేయని రోడ్లపైనే ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల దక్షిణ మధ్య రైల్వే చదును చేయని రహదారికి ఇరువైపులా ఇనుమ అడ్డంకులు ఏర్పాటు చేయడంతో చిన్నపాటి వ్యాపారస్తులు, కూలీలతో పాటు ప్రజలకు అసౌకర్యంగా మారిందని తెలిపారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఇనుప అడ్డంకులు ఏర్పాటు చేసిన 11 అంతర్గత రహదారులకు అనుగుణంగా రైల్వేట్రాక్‌ల వెంట నడక మార్గాలను ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. సమస్యను సకాలంలో పరిశీలించి పరిష్కరించాల్సిందిగా వినతి పత్రంలో కోరారు.

నాయీ బ్రాహ్మణులకు అండగా సీఎం జగన్

మంత్రి జోగి రమేష్



నాయీబ్రాహ్మణ సంఘం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: నాయీ బ్రాహ్మణ సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. పెనమలూరు సెంటర్‌లో గురువారం నాయీ బ్రాహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని తెలియజేస్తూ నాయీబ్రాహ్మణ సంఘం నేతలు ముద్రించిన కరపత్రాలను మంత్రి విడుదల చేసి ప్రసంగించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆలయాల్లో ట్రస్టు బోర్డు సభ్యులుగా నాయీబ్రాహ్మణులకు జగనన్న ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. కులదూషణ, ఇతర హక్కులపై ప్రభుత్వం ప్రత్యేక జీఓ జారీ చేసిందని అన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో కూడా నాయీ బ్రాహ్మణులకు తగిన ప్రాధాన్యత కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ మల్కాపురం కనకారావు, నేతలు ఆకునూరు సుబ్బారావు, తెన్నేటి ప్రకాష్, అయోధ్య సత్యనారాయణ, చాగంటిపాటి శివరామకృష్ణ, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, పార్టీ నేతలు అన్నే వేణుగోపాల కృష్ణ మూర్తి, దేవభక్తుని సుబ్బారావు, రాయవరపు గణపతి, మున్నంగి కిరణ్‌కుమార్, సాంబశివరావు, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకోటయ్యస్వామి ఉరుసు మహోత్సవం



సాంబశివరావు దంపతులకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న కమిటీ సభ్యులు

గన్నవరం: స్థానిక కొత్తపేటలోని శ్రీకోటయ్యస్వామి ఆలయంలో గురువారం 13వ ఉరుసు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత కృష్ణబలిజ సంఘం ఆధ్వర్యంలో శ్రీకోటయ్యస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గన్నవరంతో పాటు పరిసర గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి సన్నిధిలోని లడ్డూ ప్రసాదాన్ని వీసం సాంబశివరావు, మౌనికదేవి దంపతులు వేలంపాటలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 2,500 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. కృష్ణబలిజ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీసం శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు మొవ్వ నాగబాబు, గౌరవాధ్యక్షుడు వీసం ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు వీసం నాగబాబు, సంఘం నేతలు అత్తులూరు కొండలరావు, మల్లికార్జునరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి



యనమలకుదురులో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

పెనమలూరు: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలని పెనమలూరు సీఐ టీవీవీ రామారావు అన్నారు. రానున్న ఎన్నికల సందర్భంగా ఎస్పీ అద్నాన్‌నయీం ఆస్మి ఆదేశాల మేరకు గురువారం యనమలకుదురు, కానూరు గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామారావు మాట్లాడుతూ ఓటర్లకు ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యంలో చాలా విలువైందని అన్నారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు వేయడానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సంఘ వ్యతిరేక శక్తుల ఆట కట్టించడానికి కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారిపై ఇప్పటికే బైండోవర్ కేసులు పెట్టామని తెలిపారు. పారదర్శక ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా పోలీసు బలగాలు విధులు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు, కేంద్ర బలగాలు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబాపురానికి డిస్ట్రిక్ట్ మినరల్ నిధులు

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామంలో తాగునీటి సరఫరాను మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ నిధులు రూ. 78 లక్షలను విడుదల చేసినట్టు అంబాపురం గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్, కో–కన్వీనర్ తోడేటి బెంజిమెన్ తెలిపారు. గురువారం గ్రామ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ గ్రామంలో తాగునీటి కోసం ప్రభుత్వం నుంచి నిధులను విడుదల చేయించినట్టు పేర్కొన్నారు. ఈ నిధులతో గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. అలాగే గ్రామంలో పైపులైన్ల నిర్మాణానికి రూ. 57.70 లక్షల జలజీవన్ మిషన్ నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని వారు పేర్కొన్నారు.

సచివాలయాలతో ప్రభుత్వ సేవలు చేరువ



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న శేషగిరిరావు, ప్రజా ప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని జేసీఎస్ మండల కన్వీనర్ ఆవిర్నేని శేషగిరిరావు పేర్కొన్నారు. బాపులపాడు మండలం వేలేరులో రూ. 1.41 కోట్లతో ఒకే ప్రాంగణంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాల సముదాయాన్ని గురువారం శేషగిరిరావు, ప్రజాప్రతినిధులు లాంఛనంగా ప్రారంభించారు. రూ. 45 లక్షలతో రెండు అంతస్తులతో గ్రామ సచివాలయ భవనం, రూ. 28 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ. 25 లక్షలతో డిజిటల్ లైబ్రరీ, రూ. 23 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించినట్లు శేషగిరిరావు తెలిపారు. అంతేకాక ఈ భవన సముదాయం చుట్టూ పంచాయతీ నిధులు రూ. 20 లక్షలతో ప్రహరీగోడ నిర్మించామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడకల వీర్రాజు, సర్పంచ్ సాదిమెళ్ల సుందరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు యోహాన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడికి కానుకగా వాటర్ కూలర్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వేసవిలో దుర్గమ్మ దర్శనానికి విచ్చేసే భక్తులు చల్లటి మంచినీటిని అందించేందుకు అవసరమైన కూలర్‌ను పాలక మండలి సభ్యుడు కట్టా సత్తెయ్య గురువారం దేవస్థానానికి అందజేశారు. సుమారు రూ. 10 వేల విలువైన వాటర్ కూలర్‌ను దేవస్థాన వైదిక కమిటీ సభ్యుడు శంకరశాండిల్య చేతుల మీదగా ఆలయ అధికారులకు అందజేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వాటర్‌కూలర్‌ను అందుబాటులో ఉంచాలని కట్టా సత్తెయ్య ఆలయ అధికారులను కోరారు.